ఉస్మానియా ఆస్పత్రిలో పెయిన్ క్లినిక్ ప్రారంభం


పెయిన్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో పెయిన్ క్లినిక్‌ను డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నొప్పి నివారణకు అధునాతన, మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తామని తెలిపారు. ప్రవాస భారతీయ వైద్యులు, సహ దాతల సహకారంతో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహే తదితరులు పాల్గొన్నారు.


రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ చేసిన పిల్లలతో నిమ్స్ వైద్య బృందం

నిమ్స్‌లో ఇద్దరు బాలురకు అరుదైన చికిత్స

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): గుండె దడతో వచ్చిన ఇద్దరు బాలురకు నిమ్స్ వైద్యులు అరుదైన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఇద్దరు బాలురకు సుప్రావెంట్రిక్యులర్ అరిథ్మియాలకు సంక్లిష్ట రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ (ఆర్ఎఎఫ్ఎ) ప్రక్రియను నిర్వహించినట్లు వివరించారు. వివరాలను నిమ్స్ సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఓరుగంటి సాయి సతీష్ వివరించారు. ఖమ్మంకు చెందిన 15 ఏళ్ల బాలుడు చిన్నప్పటి నుంచి తరుచూ దడతో ఇబ్బంది పడుతున్నాడు. ఆ బాలుడిని ఇటీవల నిమ్స్‌కు తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అతనికి కుడి వైపు గుండె ఉన్నట్లు, థొరాక్స్, ఉదరంలోని ప్రధాన అవయవాలు వ్యతిరేక దిశలో ఉన్నట్లు గుర్తించారు. వక్రీకరించిన గుండె శరీర నిర్మాణ శాస్త్రం, చిన్న వయసు, కాథెటర్లను ఉంచడంలో ఇబ్బంది, దడకు కారణమయ్యే అసాధారణ బహుళ విద్యుత్ సర్క్యూట్ల వివరణ సవాళ్లను 3డీ ఈ మ్యాపింగ్ సహాయంతో అధిగమించారు. వక్రీభవన దడకు కారణమయ్యే మరొక సర్క్యూట్‌తో పాటు అసాధారణ అదనపు విద్యుత్ మార్గం ఆర్ఎఫ్ శక్తితో విజయవంతంగా తొలగించినట్లు ఆయన వివరించారు.

నాలుగు నెలల్లో 25 సార్లు గుండె దడ

నగరానికి చెందిన మరో 14 ఏళ్ల బాలుడు నాలుగు నెలల్లో 25 సార్లకు పైగా గుండె దడతో అస్వస్థతకు గురయ్యాడు. పలు ఆస్పత్రులను సందర్శించిన తర్వాత అతను ఇటీవల నిమ్స్‌కు వచ్చాడు. ఆ బాలుడిని పరీక్షించిన వైద్యులు మిట్రల్ వాల్వ్ దగ్గర గుండె ఎడమ వైపు అసాధారణమైన అదనపు విద్యుత్ ఉత్పత్తి చేసే సమస్య ఉన్నట్లు గుర్తించారు. దీనిని 3డీ మ్యాపింగ్ సహాయంతో, దృష్టి రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్‌తో తొలగించినట్లు చెప్పారు. ప్రక్రియ తర్వాత ఇద్దరు బాలురు గుండె దడ నుంచి పూర్తిగా విముక్తి పొందారని, ఈ వైద్య ప్రక్రియ ఉచితంగా నిర్వహించామని డాక్టర్ సాయి సతీష్ తెలిపారు. ఈ వైద్య ప్రక్రియలో డాక్టర్ హేమంత్, డాక్టర్ సునీత, డాక్టర్ అజేయ, డాక్టర్ మౌనిక, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అనురాగ్, క్యాత్ ల్యాబ్ టెక్నీషియన్లు ప్రమీల, రామారావు, నర్సింగ్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ ఉన్నారు.

కిమ్స్‌లో 35 ఏళ్ల మహిళకు..


కోలుకున్న మహిళతో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు

రాయదుర్గం, మే 17 (ఆంధ్రజ్యోతి): థైరాయిడ్ వాపు వల్ల గుండె, ఊపిరితిత్తులు, ప్రధాన రక్తనాళాలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్న 35ఏళ్ల మహిళకు కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. కిమ్స్ ఆస్పత్రి థొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. 35ఏళ్ల మహిళ ఊపిరి అందక ఇబ్బంది పడుతుండడంతో కుటుంబసభ్యులు ఇటీవల కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారని తెలిపారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఆమెకు చాలా కాలంగా థైరాయిడ్ వాపు సమస్య ఉందని, అది క్రమంగా మెడ నుంచి కిందకి వెళ్లి ఎద భాగాన్ని ఆక్రమించిందని గుర్తించామని తెలిపారు. కుడివైపు ఊపిరితిత్తులు, గుండె, ప్రధాన రక్తనాళాన్ని ఆక్రమిస్తూ రెట్రోస్టెర్నల్ గాయిటర్‌గా రూపొందిందని గుర్తించామని ఆయన పేర్కొన్నారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నైపుణ్యంతో 15సెంటీమీటర్ల పొడవున్న కణితిని తొలగించామని వివరంచారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని వారం రోజుల తర్వాత డిచార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు.

వైద్య చికిత్సలో అల్ట్రాసౌండ్ కీలకం


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్ర జ్యోతి): అత్యవసర వైద్య చికిత్సలో అల్ట్రాసౌండ్ పరికరం కీలకంగా మారిందని కేర్ హాస్పిటల్స్ అసోసియేట్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్ వర్మ కె పేర్కొన్నారు. కేర్ ఆస్పత్రి బంజారాహిల్స్ ఆధ్వర్యంలో, సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా (ఎస్ఈఎంఐ) ఆధ్వర్యంలో శనివారం జాతీయ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్ (ఎన్‌యూఎల్ఎస్) వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్‌పై వైద్యులకు శిక్షణ ఇస్తున్నామని, దీని వల్ల వారిలో నైపుణ్యం పెరుగుతుందని వివరించారు. సెమీ అకడమిక్ చెయిర్ డాక్టర్ శ్రీనత్ కుమార్ టీఎస్ మాట్లాడారు. ట్రామా, కార్డియాక్ అరెస్ట్, షాక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో పేషెంట్లను త్వరగా అంచనా వేసేందుకు అవసరమైన అల్ట్రాసౌండ్ సాంకేతికతలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో సెమీ బోర్డు అధ్యక్షురాలు డాక్టర్ సౌజన్య పట్టిబండ్ల, దేశవ్యాప్తంగా ఉన్న ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వార్డులో రోగులకు తిరిగే స్వేచ్ఛ

- జైలు శాఖ నియంత్రణలో ఖైదీ రోగులకు భద్రత
- మానసిక చికిత్సాలయం సూపరింటెండెంట్ డాక్టర్ అనిత

హైదరాబాద్ సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): మానసిక చికిత్సాలయంలో కుటుంబ వార్డులలోని రోగులకు స్వేచ్ఛగా తిరిగే హక్కు ఉంటుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల తెలిపారు. కొన్నిసార్లు వారు ఆస్పత్రి ప్రాంగణాన్ని వదిలివెళ్తారని, ఆ సమయంలో రోగులు కుటుంబసభ్యుల కస్టడీ నుంచి తప్పించుకుంటారని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురించిన 'మానసిక చికిత్సాలయం నుంచి నిత్యం రోగులు మాయం' కథనానికి ఆమె స్పందించారు. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 ప్రకారం, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు కనీస నియంత్రణతో చికిత్స చేయాలని, అందుకే, కుటుంబ వార్డుల వ్యవస్థ ఉందన్నారు. ఇక్కడ కుటుంబసభ్యులు రోగిని జాగ్రత్తగా చూసుకోవడానికి వారితో పాటు ఉండటానికి అనుమతిస్తారని తెలిపారు. జైలు రోగుల కోసం ప్రత్యేకంగా ఒక భవనం ఉందని, వారి పర్యవేక్షణ, భద్రత జైలు శాఖ నియంత్రణలో ఉంటుందని వివరించారు. దూకుడుగా ఉండే రోగులను, న్యాయాధికారులు, పోలీసులు సూచించిన రోగులను మాత్రమే క్లోజ్ వార్డులో ఉంచుతామని ఆమె తెలిపారు.

రూ.1.50 కోట్లతో భోలక్‌పూర్ రోడ్ల అభివృద్ధి

ఎమ్మెల్యే ముఠా గోపాల్


పింఛన్ రావడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన వృద్ధురాలు

ముషీరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మొదటి విడత రూ.కోటి 50లక్షలతో అధ్వానంగా మారిన రోడ్లను అభివృద్ధి పరిచామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శనివారం బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో డివిజన్‌లోని రంగా నగర్, బొంతల బస్తీ, బంగ్లాదేశ్ మార్కెట్, గుల్షన్ నగర్, పహాడి మసీద్ వీధి తదితర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, జలమండలి సెక్షన్ మేనేజర్ శ్రీధర్‌తో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొదటి విడత రోడ్డు పనులు పూర్తి అయిన వెంటనే మరో కోటి 50లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఈ నిధులతో పెండింగ్‌లో ఉన్న రోడ్లను సైతం పూర్తి చేస్తామన్నారు. బొంతల బస్తీలో అధ్వానంగా మారిన డ్రైనేజీ పైప్‌లైన్‌లను తొలగించి, కొత్తవి వేస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను తీర్చే విధంగా అంకితభావంతో పనిచేస్తున్నామన్నారు. తమ పార్టీ నేతలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, డివిజన్ బీసీసెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, డివిజన్ మాజీఅధ్యక్షుడు మహ్మద్‌అలీ, డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మగ్బూల్, జబ్బార్, నాయకులు గోవింద్‌రాజ్, ఎస్ నవీన్‌కుమార్, నజీర్, చాంద్‌పాషా, ప్రవీణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సార్ పింఛన్ రావడం లేదు

సార్.. నడవలేకపోతున్నా. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా పింఛన్ రావడంలేదు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదు. 'మీరైనా పింఛన్ ఇప్పించండి' అని భోలక్‌పూర్ డివిజన్ బొంతల బస్తీకి చెందిన ఎం.మల్లమ్మ అనే వృద్ధురాలు ఎమ్మెల్యేకు మొరపెట్టుకుంది. స్పందించిన ఎమ్మెల్యే 'అమ్మ బాధపడకు. నేను ఎంఆర్‌వోతో మాట్లాడి పింఛన్ మంజూరు చేయిస్తా' అని హామీ ఇచ్చారు.

శ్రీమాలిక గ్రంథావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సురభి వాణీదేవి తదితరులు

చిక్కడపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, శ్రీశైలం దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారు డా.పురాణపండ శ్రీనివాస్ రచించిన శ్రీమాలిక గ్రంథావిష్కరణ సభ శనివారం సాయంత్రం త్యాగరాయ గానసభలో జరిగింది. గానసభ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ సురభివాణీదేవి పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీనివాస్ రచించిన శ్రీమాలిక రచనలోని కొన్ని ఘట్టాలు తనను ఆకట్టుకున్నాయన్నారు. తనను తన్మయత్వానికి గురిచేసిన ఆ ఘట్టాల రచన అద్భుతంగా ఉందన్నారు. ఎన్నో అద్భుత పవిత్ర గ్రంథాలను తెలుగు లోగిళ్లకు సమర్పిస్తున్న ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ ధన్యజీవులన్నారు. సభకు అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ వ్యాపార కాలుష్యం లేకుండా పవిత్రతలు నిండిన అఖండ గ్రంథాలు అందించడంలో శ్రీనివాస్ అగ్రశ్రేణిలో కనిపిస్తారని మేధాసమాజం చెబుతుందన్నారు. ఈ మంగళ ఉద్యమానికి సహకరిస్తున్న ఐఏఎస్ రిటైర్డ్ అధికారి రమణాచారి, కిమ్స్ ఆస్పత్రి చైర్మన్ కృష్ణయ్య, శ్రీఅమృతేశ్వరం ఆలయం చైర్మన్ సాయి కొర్రపాటికి కృతజ్ఞతలు తెలిపారు. గానసభ సంయుక్త కార్యదర్శి తాళ్లపల్లి చక్రపాణి, ప్రముఖులు బండి శ్రీనివాస్, గానసభ కార్యవర్గసభ్యులు గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.


హఫీజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు

మైనార్టీమోర్చా డివిజన్ అధ్యక్షుడిగా హఫీజ్

చిక్కడపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సబర్మతినగర్‌కు చెందిన మహ్మద్ హఫీజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం హఫీజ్‌కు నియామకపత్రాన్ని టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అందజేసి అభినందించారు. హఫీజ్ మాట్లాడుతూ వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో గాంధీనగర్ డివిజన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు.

తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య హైదరాబాద్ కన్వీనర్‌గా మనోజ్‌గౌడ్

రాంనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య హైదరాబాద్ కన్వీనర్‌గా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన జాగృతి సీనియర్ నాయకుడు పరకాల మనోజ్‌గౌడ్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ఆ సంస్థ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా మనోజ్‌గౌడ్ కవితకు బొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

నల్లకుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మందులబస్తీలో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు శనివారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే బీఆర్ఎస్ బాగ్‌అంబర్‌పేట డివిజన్ ప్రధాన కార్యదర్శి కెంచె మహేష్‌కుమార్‌కు సూచించి ఆ బస్తీకి వెళ్లి సమస్యలను గుర్తించాలని ఆదేశించారు. దీంతో ఆయన బస్తీకెళ్లి స్థానిక ప్రజలను కలిసి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. మందులబస్తీలో లోప్రెషర్, పవర్‌బోర్ ఏర్పాటు చేయాలని, దోమల బెడద, శ్మశానవాటికలో పేరుకుపోయిన చెత్తాచెదారం సమస్యలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఈ సమస్యల గురించి మహేష్‌కుమార్ ఎమ్మెల్యేకు సెల్‌ఫోన్‌లో వివరించారు. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట డివిజన్లలోని మైనారిటీలకు మంజూరైన షాదీముబారక్ చెక్కులను శనివారం అంబర్‌పేట మండల కార్యాలయంలో పంపిణీ చేశారు. అంబర్‌పేట తహసీల్దార్ మీరాబాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్పొరేటర్లు బి.పద్మావెంకటరెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి 47 మందికి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'ఆదిపురుషుడు ఆది ధర్మం'ను ప్రచారం చేయాలి

రాంనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆదిపురుషుడు ఆది ధర్మం గ్రంథం విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదిపురుషుడు గ్రంథ రచయిత, ఆది పురుషధర్మ సమాజం ప్రచార ప్రధాన కర్త ప్రొఫెసర్ ఏకు తిరుపతి అధ్యక్షతన సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నల్లా సూర్యప్రకాష్, గొర్రె రాజయ్య, కార్యదర్శులు బాలకృష్ణ, గడ్డ యాదయ్య, పి.సుధాకర్; కుమారస్వామి, రవి, ఉపాధ్యక్షుడు చింత ముత్యాలరావు మాట్లాడారు. ఈ గ్రంథం ప్రాముఖ్యతను గ్రామ ప్రజలకు తెలియజేసే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఆది పురుషుడు, ఆది ధర్మం ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఉందన్నారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి రూ.41.65లక్షలు మంజూరు

ముషీరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లో మంచినీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి రూ.41.65 లక్షలు మంజూరు అయ్యాయని కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ తెలిపారు. శనివారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి స్థానిక సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... బెంజుమెన్ వీధిలో మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.18లక్షలు, హజార్ వీధిలో రూ.13.40లక్షలు, వైఎస్ఆర్ పార్కు, ఎంసీహెచ్ కలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.10.25లక్షలు జలమండలి ఎండీ మంజూరు చేశారన్నారు. భరత్‌నగర్‌లో మంచినీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సైతం నిధులు విడుదల చేయాలని కార్పొరేటర్ తెలిపారు.

గద్దర్ అవార్డ్‌ను తెలంగాణ సినిమాలకు ఇవ్వకపోతే అడ్డుకుంటాం: టీసీవీ

చిక్కడపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): గద్దర్ ఫిలిమ్ అవార్డ్‌ను తెలంగాణ సినిమాలకు ఇవ్వకపోతే అడ్డుకుంటామని తెలంగాణ సినిమా వేదిక(టీసీవీ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. శనివారం చిక్కడపల్లిలో ఏర్పాటు టీసీవీ సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహాదారు ప్రఫుల్ రాంరెడ్డి, కోకన్వీనర్ మోహన్ బైరాగి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు గడుస్తున్నా కూడా తెలంగాణ సినిమారంగంపై ఆంధ్ర సినిమా పెద్దల ఆధిపత్యం కొనసాగుతోందని ఆరోపించారు. పేరుకే తెలంగాణ ఫిలిం చాంబర్‌గా ఉంది. ఫిలిమ్ అవార్డులు ఆంధ్రఫిలిం చాంబర్‌నిర్వహించడం సిగ్గుచేటన్నారు.

'ఫార్మ్ డీ విద్యార్థులను ఎంబీబీఎస్, బీడీఎస్‌లా గుర్తించాలి'

కవాడిగూడ, మే 17 (ఆంధ్రజ్యోతి): క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ 2010 చట్టం ప్రకారం ఫార్మ్ డీ విద్యార్థులను ఎంబీబీఎస్, బీడీఎస్‌లా గుర్తించాలని తెలంగాణ ఫార్మ్‌డీ డాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ శీలం వెంకటేష్, కార్యదర్శి కె.మహాలక్ష్మి, కన్వీనర్ డాక్టర్ పి.సూర్యతేజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12 సంవత్సరాల నుంచి ఫార్మ్‌డీ పట్టభద్రులకు ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా ఆలస్యం చేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఫార్మ్ డీ హోల్డర్లను క్లినికల్ ఫార్మాసిస్టులుగా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా, జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర ఆరోగ్య సంరక్షణ వైద్యులుగా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహాధర్నాలో అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ కే.వికాస్, సమన్వయ కర్త డాక్టర్ ఎస్.మనోజ్, డాక్టర్ ఎం.అరవింద్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఉదయ్, డాక్టర్ తేజ, నిఖిలేష్, అఖిల, డాక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి

కార్పొరేటర్ పావని వినయ్ కుమార్


విజేతలకు మెమొంటోలు అందజేస్తున్న కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, తదితరులు

ముషీరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టిసారించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ సూచించారు. శనివారం గాంధీనగర్ శ్రీనివాస ప్లేగ్రౌండ్‌లో నివి చారిచటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 క్రికెట్ టొవర్నమెంట్ 2025 ముగింపు కార్యక్రమానికి పావని వినయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టొవర్నమెంట్ విజేతగా నిలిచిన ఛత్రపతి శివాజీ బాయ్స్ టీమ్‌కు మెమొంటో, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో క్రీడాకారులకు రిజర్వేషన్ కోటా ఉంటుందన్నారు. పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ పోటీల్లో 16 టీమ్‌లు పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా నివి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ విజేతలను, క్రీడాకారులను సన్మానించారు. సెంట్రల్‌జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్, ఇండియన్ మాజీ క్రికెటర్ వెంకటప్రతాప్, ఓబీసీ మోర్చా జాతీయకార్యవర్గ సభ్యుడు రాజు, బీజేవైఎం మహంకాళి జిల్లాఅధ్యక్షుడు శివాజీ, బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు నవీన్ కుమార్, నాయకులు ఆనంద్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గరుడ వాహనసేవ

చిక్కడపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గరుడవాహనసేవను నేత్రపర్వంగా నిర్వహించారు. అంతకుముందు సుప్రభాతసేవ, పుణ్యాహవాచనం, మహానివేదన, హవనం, వేదవిన్నపాలు, తీర్థప్రసాదవినియోగం, పల్లకీసేవ జరిగాయి. మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక వంశీయులు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, కీర్తి దంపతులు, ఈవో అన్నపూర్ణ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

యువత సామాజిక సేవల్లో పాల్గొనాలి: జైసింహ

చిక్కడపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): యువత సామాజికసేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం గాంధీనగర్ డివిజన్ గాంధీనగర్ ఆంధ్రాకేఫ్ వద్ద జరిగిన బీఆర్ఎస్ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారంతోపాటు సమాజసేవ చేయడం వల్ల యువతలో సమాజం పట్ల బాధ్యత అవగతమవుతుందన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ డివిజన్ కమిటీ ప్రచార కార్యదర్శి బత్తుల కిరణ్‌కుమార్‌ను జైసింహ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదారపు రాకేశ్, పోతుల శ్రీకాంత్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, పున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బడీ మసీదును పరిరక్షించాలని గవర్నర్‌కు వినతి

ముషీరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లో 400 సంవత్సరాల చరిత్రకలిగిన చారిత్రాత్మక కట్టడం బడీ మసీదును పరిరక్షించాలని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ హోహినొద్దీన్ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. చార్మినార్ నిర్మించిన సమయంలో భోలక్‌పూర్‌లో బడీమసీదు (జామియా మసీదు)ను నిర్మించారని తెలిపారు. మసీదు మినార్‌లు పెచ్చులూడి అంధకారంగా మారుతున్నదన్నారు. మసీదు మరమ్మతులకు నిధులు విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు.

రక్తపోటును నిర్లక్ష్యం చేయొద్దు : డా.మనోజ్ రెడ్డి

ముషీరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటును నిర్లక్ష్యం చేయొద్దని సకాలంలో వైద్యులను సంప్రదించి, మెరుగైన వైద్యం పొందాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి తెలిపారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో రక్తపోటుపై అవగాహన శిబిరం, వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ... రక్తపోటు లక్షణాలు తరుచూ తలనొప్పిరావడం, చూపు మందగించడం, ముక్కు నుంచి రక్తం కారడం, నీరసంగా ఉంటారని సూచించారు. సకాలంలో వైద్యులను సంప్రదించకుంటే దీర్ఘకాలిక వ్యాధులబారిన పడే అవకాశాలు ఉంటాయన్నారు.

డాక్టర్ శంకర్ ప్రజా ఆస్పత్రి భవనం సీజ్

రాంనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన డాక్టర్ శంకర్ ప్రజా ఆస్పత్రి భవనాన్ని శనివారం ముషీరాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి భవనానికి జీహెచ్ఎంసీ స్కిల్ట్ ప్లస్ నాలుగు అంతస్తుల అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. అయితే అదనంగా సెల్లార్‌తో పాటు మరో రెండు అదనపు అంతస్తులు నిర్మించారని తెలిపారు. స్థానికులు నిర్మాణంపై కోర్టుకు వెళ్లారని, కోర్టు ఆదేశాల మేరకు ఆ భవనంలో అయిదు, ఆరు అంతస్తులు, సెల్లార్‌ను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


తిరంగా యాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

తిరంగా యాత్ర

నల్లకుంట, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడాన్ని స్వాగతిస్తూ భారత ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ట్యాంక్‌బండ్‌పై మనం సహితం, దేశం కోసం జరిగిన తిరంగా యాత్రలో నల్లకుంట మాజీ కార్పొరేటర్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్ కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, హిమగిరిగౌడ్, హరిబాబు, మురళీ, సుమన్, మల్లికార్జున్, లక్ష్మణ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


●తిరంగాయాత్రకు నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్, నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● **బర్కత్‌పుర:** తిరంగాయాత్రకు కాచిగూడ డివిజన్ అభివృద్ధి కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, జీవీఆర్ కరాటే అకాడమి వ్యవస్థాపకులు డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **అంబర్‌పేట:** తిరంగా ర్యాలీలో అంబర్‌పేట బీజేపీ నేతలు దాసోజు నాగభూషణచారి, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● **రాంనగర్:** తిరంగాయాత్రకు టీడీపీ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా, నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం సీనియర్ నేత మృతి


సత్యనారాయణ (ఫైల్)

ముషీరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో గంగపుత్ర సంఘం సీనియర్ నాయకుడు రుద్ర సత్యనారాయణ(77) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రముఖ వీఎస్‌టీ కంపెనీలో యూనియన్ నాయకుడిగా, గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషిచేశారని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు జగన్, ఉపాధ్యక్షులు పూస శ్రీరాములు, గోరక్‌నాథ్ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. సత్యనారాయణ అంత్యక్రికలు పార్శిగుట్ట గంగపుత్ర సంఘం శ్మశానవాటికలో జరిగాయి.

'ఎస్సీ ఎంపీని ఆహ్వానించకపోవడం దుర్మార్గం'

నల్లకుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సరస్వతీ పుష్కరాల్లో ప్రొటోకాల్ పాటించకుండా ఎస్సీ ఎంపీ గడ్డం వంశీకృష్ణను అవమానించారని పలు దళిత సంఘాల నేతలు ఆరోపించారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజువస్తాద్, నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు మాట్లాడారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ దళితుడైనందుకే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సరస్వతీ పుష్కరాలకు ఆహ్వానించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నేతలు మధు, మచ్చ శ్రీనివాస్, వెంకటేష్, విశాల్ దాసరి పాల్గొన్నారు.

● **నల్లకుంట:** కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు ఆహ్వానించకుండా ఎస్సీ ఎంపీని అవమానించడం శోచనీయమని జైభీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు పేర్కొన్నారు. శనివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కార్యక్రమంలో స్థానిక ఎస్సీ ఎంపీని ఆహ్వానించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు.

● **నల్లకుంట:** తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రారంభమైన కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు ప్రొటోకాల్ ప్రకారం ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఆహ్వానించకపోవడం అవమానకరమని తెలంగాణ రాష్ట్ర దళిత సేన మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి పేర్కొన్నారు. శనివారం హైదర్‌గూడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ వైనంపై మంత్రి శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యార్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.